కౌలు రైతుల పేరుపై ఇ - పంట నమోదు చేయాలి

కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

కౌలు రైతుల పేరు మీదే ఇ-పంట నమోదు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు అన్నారు. బుధవారం మార్టేరులో జరిగిన కౌలు రైతుల జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశానికి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు అధ్యక్షత వహించారు. ఇప్పటివరకూ రైతులందరికీ ధాన్యం డబ్బులు అందకపోవడం వల్ల ఇప్పటికే మొదలు పెట్టాల్సిన సార్వా పనులు పెట్టుబడి లేక ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని వాపోయారు. కౌలు రైతుల కోసం 2019 సిసిఆర్‌సి చట్టాన్ని సవరణ చేయాలని, భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో పలు గ్రామాలకు చెందిన కౌలు రైతులు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో.. నిబంధనలకు 'నీళ్లు'..!

జిల్లాపరిషత్ ఆవరణలో ఉన్న పంచాయతీరాజ్ మినిస్టీరియల్ అసోషియేషన్ భవనం

జెడ్‌పి ఆవరణలో స్థలాల కేటాయింపుపై ఆరోపణలు

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం స్థల కేటాయింపులో పలు వివాదాలు

తాజాగా వ్యాపార కార్యకలాపాలకు వాడుకునేలా అనుమతులివ్వడంపై తీవ్ర చర్చ

జెడ్‌పిలో అడ్డగోలు నిర్ణయాలపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'జిల్లా పరిషత్ ఆస్తులను ఇష్టానుసారంగా పంచేస్తున్నారా.. నిబంధనలతో సంబంధం లేకుండా ఉత్తర్వులు జారీ చేసేస్తున్నారా.. పాలకులు, అధికారులు కుమ్మక్కై జెడ్‌పి ఆస్తులను అన్యాక్రాంతం చేస్తున్నారా' అంటే అవుననే సమాధానం వస్తోంది. జిల్లా పరిషత్ ఆవరణలో నిర్మించిన పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలాపాలకు వినియోగించుకోవచ్చని తాజాగా ఉత్తర్వులు ఇచ్చినట్లు చర్చ సాగుతోంది. జిల్లా పరిషత్ పాలకులు, అధికారులు అంతా మూకుమ్మడిగానే ఈ వ్యవహారం సాగించినట్లు తెలుస్తోంది. పంచాయతీరాజ్ చట్టం 1994 ప్రకారం గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు చెందిన ఆస్తిని ఉచితంగా ఇవ్వాలంటే రాష్ట్ర మంత్రివర్గం ముందు పెట్టాలి. అలాంటి ప్రక్రియ ఏమీ లేకుండానే 2018-2019లో ఎపి పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం' జిల్లా శాఖకు తొలుత వందగజాలు, తర్వాత మరో 25 గజాలు మొత్తం 125 గజాలు కేటాయించేశారు. ఈ స్థలం జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కగా కేటాయించడం గమనార్హం. జిల్లా పరిషత్ ఆవరణలోని ఆ స్థలంలో రూ.30 లక్షలు వెచ్చించి ఆ సంఘ భవనం సైతం నిర్మించారు. నిబంధనల ప్రకారం ఉద్యోగ సంఘాలకు కేటాయించిన స్థలాలు, అక్కడ నిర్మించిన భవనాల్లో సంఘ కార్యకలాపాలు మాత్రమే నిర్వహించాలి. వాణిజ్య కార్యకలాపాలకు ఆ భవనాలు ఉపయోగించడం నిబంధనలకు విరుద్ధం. జెడ్‌పి ఆవరణలో స్థలం కేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా సాగించడమే కాకుండా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ భవనంలో వాణిజ్య కార్యకలాపాలు చేసేందుకు అప్పట్లో ప్రయత్నాలు జరిగాయి. అయితే నాటి జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారి రేవు ముత్యాలరాజు దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి ఆ భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత జిల్లా కలెక్టర్‌గా వచ్చిన కార్తికేయమిశ్రాను సదరు ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి ఎటువంటి వాణిజ్య కార్యకలాపాలు చేయబోమని హామీ ఇవ్వడంతో సానుకూల దృక్పథంతో తిరిగి వారికి ఇచ్చారు. దీనికి సంబంధించి ప్రమాణ పత్రం సైతం నేతలతో రాయించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే భవనాన్ని స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు.

ఇప్పుడు వ్యాపార కార్యకలాపాలకు అనుమతులు ఎలా?

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ భవనంలో వ్యాపార కార్యకలాపాలు చేయకూడదని విధించిన నిబంధనలు తుంగలో తొక్కి తాజాగా సంఘ భవనంలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చునని అధికారికంగా జిల్లా పరిషత్ నుంచి ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ ఉత్తర్వులు సైతం 2023 ఏప్రిల్ అంటే గత వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన జిల్లా పరిషత్ జనరల్ బాడీ తీర్మానం ప్రకారం ఇచ్చామని పేర్కొన్నట్లు సమాచారం. 2023లో తీర్మానం చేస్తే దాదాపు రెండేళ్ల తర్వాత 2025 జూన్‌లో ఉత్తర్వులు ఇచ్చారన్నమాట. రెండేళ్ల క్రితమే ఉత్తర్వులు ఎందుకు ఇవ్వలేదు. ఇప్పుడు ఎందుకిచ్చినట్లు.. రికార్డు ఏమైనా ట్యాంపరింగ్ జరిగిందా అనేది ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది. వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చునని చేసిన తీర్మానం ఎజెండాలో, సప్లిమెంటరీ ఎజెండాలో ఉందా అనేది తేలాలి. తీర్మానం ప్రతిపాదించిందెవరో కూడా ప్రజలకు తెలియపర్చాల్సిన బాధ్యత జిల్లా పరిషత్ అధికారులపై ఉంది. అంతేకాకుండా 2023 ఏప్రిల్‌లో జరిగిన జనరల్‌బాడీ ప్రొసీడింగ్స్, మినిట్స్‌లో సదరు తీర్మానం నమోదు చేశారో, లేదో చెప్పాల్సి ఉంది. ఎటువంటి ఉత్తర్వులూ జారీ చేయకపోతే ఆ వివరాలైనా ప్రజలకు తెలియపరిచి అనుమానాలు నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అసోసియేషన్ భవనాన్ని వ్యాపార కార్యకలాపాలకు అనుకూలంగా మార్చుకుని నెలకు రూ.50 వేలు వరకూ ఆదాయం సంపాదించుకునే విధంగా ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్ పాలకులు, అధికారులు జెడ్‌పి ఆస్తులకు ట్రస్టీలుగా వ్యవహరించాలే తప్ప నిబంధనలకు విరుద్ధంగా అన్యాక్రాంతం చేయడం దారుణమని చెప్పొచ్చు. దీని వెనుక పెద్ద గూడుపుఠాణి జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి వాస్తవాలు ప్రజలకు తెలియజేయడంతోపాటు, జెడ్‌పి ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సి ఉంది. జెడ్‌పి ఆవరణలోని ఉద్యోగ సంఘ భవనంలో వ్యాపార కార్యకలాపాలు చేసుకోవచ్చునని జారీ చేసినట్లు తెలుస్తున్న ఉత్తర్వులపై జిల్లా పరితష్ సిఇఒ ఎం.శ్రీహరిని వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఇవిఎం గొడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం పిపి రోడ్డులోని స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గొడౌన్‌లో భద్రపర్చిన ఇవిఎం యంత్రాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం పరిశీలించారు. గొడౌన్‌కు వేసిన సీళ్లను ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రతి మూడు నెలలకోసారి ఇవిఎంలు భద్రపర్చిన గొడౌన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపడం జరుగుతుందని తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా ఫైర్ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు, ఎలక్షన్ సెక్షన్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ మరాపు సన్యాసిరావు, టిడిపి ప్రతినిధి మరపట్ల శ్యాంబాబు, జనసేన ప్రతినిధి బి.జయశివ ఉన్నారు.

గొడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

పెన్షన్ల చట్టం సవరణ తగదు

డిఆర్‌ఒకు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వినతి

ప్రజాశక్తి - భీమవరం

పెన్షన్ నిబంధనల సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. కలెక్టరేట్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపులో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గాతల జేమ్స్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాగిరాజు సత్యనారాయణ రాజు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం ద్వారా పెన్షనర్లను గ్రూపులుగా విభజించే అధికారం తన చేతిలోకి తీసుకుందన్నారు. వేతన సవరణ సంఘం సిఫార్సులను పాత పెన్షనర్లకు వర్తింపజేయకుండా, కొత్తగా రిటైర్ అయ్యే వారికి మాత్రమే వర్తింపజేసే అధికారం కలిగి ఉందన్నారు. దీనివల్ల పాత పెన్షనర్లు నష్టపోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఇటీవల పార్లమెంట్లో ఈ చట్టాన్ని ఆమోదించారని, నిబంధనల సవరణలను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలిపారు.



డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘం నేతలు

భీమవరంలో మెగా జాబ్ మేళా

45 మందికి ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం ఆర్‌ఆర్‌డిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, నేషనల్ కెరియర్ సర్వీస్ ఆధ్వర్యంలో బుధవారం వికలాంగులకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 65 మంది యువతీ యువకులు హాజరు కాగా 14 ప్రముఖ కంపెనీలో 45 మంది ఉద్యోగాలు పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడారు. యూత్ ఫర్ జాబ్ ఫౌండేషన్, రెడ్డి ఫౌండేషన్ వారు ఈ ఉద్యోగ మేళాలో అర్హతల మేరకు యువతీ యువకులను ఎంపిక చేసి రెండు నెలలు పాటు శిక్షణ ఇచ్చి అనంతరం ఉద్యోగ నియామకాలు చేపడతారన్నారు. వికలాంగ నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనలో ఏమైనా ఇబ్బందులు ఉన్నా, ప్రభుత్వ పరంగా ఏమైనా సహాయం కావాలన్నా చేయడానికి ప్రభుత్వం యంత్రాంగం సిద్ధంగా ఉంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వికెజి ప్రసన్న, ఎం.కిషోర్ రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ రమణరాజు, హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

మొగల్తూరులో రోడ్డుపై నిచిలిన వర్షపు నీరు

జిల్లాలో పలు చోట్ల వర్షం

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ చిరుజల్లులు పడ్డాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో రైతులు తొలకరి పనులకు సన్నద్ధమవుతున్నారు. రాత్రి సమయంలో ఈదురుగాలుల నేపథ్యంలో కరెంటు కోతలు తరచూ ఉంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీంతో ప్రజలు ఒక పక్క ఉక్కపోత, మరోపక్క దోమలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వర్షంతో మండల ప్రజలు ఉపశమనం పొందారు.

పెనుమంట్ర: బుధవారం తెల్లవారుజామున మండలంలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పడిన చిరుజల్లులకు జనం ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా పనులకు వెళ్లే వారు, విద్యార్థులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

పాలకొల్లు : పాలకొల్లులో బుధవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. దీంతో పట్టణంలో వ్యాపారాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. అయితే ఖరీఫ్ సాగు రైతులు సన్నద్ధమవుతున్నారు.

మొగల్తూరు : మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకూ చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. ఆక్వా చెరువుల్లో ఆక్సిజన్ శాతం పడిపోవడంతో రైతులు ఆయిల్ ఇంజిన్లు, ఏరియేటర్లను వినియోగిస్తున్నారు. గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేక వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్లపైనే నిలిచిపోతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

శివరామప్రసాద్ కృషి అభినందనీయం

బదిలీ సందర్భంగా ఘనంగా సత్కరించిన జిల్లా అధికారులు

ప్రజాశక్తి - భీమవరం

పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించిన టి.శివరామప్రసాద్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ శాఖల అధికారులంతా ఆయనకు ఘనంగా వీడ్కోలు చెప్పారు. పెద్ద ఎత్తున సభ ఏర్పాటు చేసి ఆయనను సత్కరించి పని రాక్షసుడని కొనియాడారు. 2022 జులై నుంచి 2025 వరకూ పశ్చిమగోదావరి జిల్లాలో ఆయన పౌర సరఫరాల శాఖ డిఎంగా పని చేశారు. అత్యుత్తమ సేవలందించి వరుసగా ఆరుసార్లు అవార్డులు అందుకున్న శివరామప్రసాద్ కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన సత్కార సభకు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, పౌరసరఫరాల సిబ్బంది, రైస్ మిల్లర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెసి, అధికారులు మూడేళ్లలో శివరామ ప్రసాద్‌తో వారి అనుభవాలను పంచుకున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక ధాన్యం దిగుమతి పశ్చిమగోదావరి జిల్లా అయినప్పటికీ ఎటువంటి అవంతరాలు లేకుండా విజయవంతంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేశారని తెలిపారు. రేషన్ దుకాణాల వద్ద అందుబాటులో ఉంచాల్సిన నిత్యావసర సరుకులను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఇచ్చిన కాల పరిమితిలోనే వాటిని అక్కడ అందుబాటులో ఉంచారని తెలిపారు. జెసి మాట్లాడుతూ శివరామ ప్రసాద్ పోటీ తత్వం కలిగిన మనిషి అన్నారు. ఈ మధ్య డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద పిల్లల కోసం ఫైన్ క్వాలిటీ రైస్‌ను 25 కేజీల బస్తాలలో స్కూళ్లకు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అయితే ఆ బియ్యం జిల్లాలో అందుబాటులో లేదని, అయినా ఆ క్వాలిటీ రైస్ అందుబాటులో ఉన్న జిల్లాలను కూడా దాటి పశ్చిమగోదావరి జిల్లాను మొదటి స్థానంలో ఉంచినట్లు తెలిపారు. సెలవులు తీసుకోకుండా పనిచేసేది ఎవరంటే ఒకరు రెవెన్యూ డివిజనల్ అధికారి నరసాపురం, ఇంకొకరు టి.శివరామ ప్రసాద్ అని తెలిపారు.

సభలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

సొమ్ము చెల్లించినా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయలేదు

జిల్లా సహకార అధికారి మురళీకృష్ణకు హౌసింగ్ సొసైటీ బాధితుల వినతి

ప్రజాశక్తి - భీమవరం

సొమ్ము చెల్లించినా ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయలేదని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ బాధితులు వాపోయారు. కలెక్టరేట్లో జిల్లా సహకార అధికారి సంకు మురళీకృష్ణను బాధితులు కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీహరిపురంలో ప్రభుత్వ ఉద్యోగుల కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో లేఅవుట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిలో ఫ్లాట్ నిమిత్తం డబ్బులు చెల్లించినప్పటికీ ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేయడం లేదని తెలిపారు. మూడేళ్ల నుంచి అభివృద్ధి పనులు చేస్తున్నామని కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. అనేక ఆర్థిక అవకతవకలకు పాల్పడిన పాలకవర్గాన్ని రద్దు చేయాలన్నారు. ప్రత్యేకాధికారిని నియమించి, సమగ్ర దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా సహకార అధికారికి వినతి పత్రం అందజేసిన వారిలో టిఎస్‌పి.వర్మ, కుక్కల బాల, కె.పెద్దిరాజు, మోటేపల్లి శ్రీనివాస్, నందమూరి రాజా, శ్రీనివాస వర్మ ఉన్నారు.

మూడో రోజుకు మున్సిపల్ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బంది వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని మున్సిపల్ కార్మికుల జెఎసి నాయకులు మర్రిపూడి సతీష్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వరుసగా మూడో రోజు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ సంక్షేమ పథకాలు అమలు చేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు ఎం.సతీష్ కుమార్ మాట్లాడుతూ రూ.13 వేల జీతంతో చాలీచాలని బతుకులు సాగిస్తున్నామని తెలిపారు. టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 వేతనం అమలు చేయాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ అనంతరం రూ.10 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు ఎం.సతీశ్‌కుమార్, అవిడి కుమార్, యర్రంశెట్టి నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం : మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం పట్టణంలో నిరసన ర్యాలీ చేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకూ ర్యాలీ సాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమానికి పి.రత్నం, వి.ఫణి. ఎం.సత్యనారాయణ, కె.కాశీ, సిహెచ్.వాసు, ఎ.మధుబాబు, ఎం.సుజాత, కె.కళ్యాణి, ఎస్.దేవి నాయకత్వం వహించారు. వరుసగా మూడో రోజు మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు కొనసాగించారు.

తణుకు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 3వ రోజుకు చేరింది. ఈ మేరకు కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటి (జెఎసి) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఉండ్రాజవరపు శ్రీను, ప్రధాన కార్యదర్శి గెల్లా విజయకుమార్ మాట్లాడారు. కార్మికులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పి.శ్రీదేవి, పి.దానం, పి.పెద్దిరాజు, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

సమాధి తొలగింపుపై ఉద్రిక్తత

పోలీసులు, రెవెన్యూ అధికారుల చొరవతో తొలగింపు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని రుస్తుంబాద పంచాయతీ పరిధిలోని గాదివారితోటలో బుధవారం సమాధి తొలగింపు సమయంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ నేపథ్యంలో మృతుని కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో రెండు గంటల పాటు హై టెన్షన్ నెలకొంది. పోలీసులకు మృతుని కుటుంబ సభ్యుల మధ్య వాగ్వివాదం జరిగింది. చివరికు అధికారులు సమాధిని తొలగించారు. ఇంజేటి వరప్రసాద్ గతేడాది మృతి చెందాడు. ఆయనను యర్రంశెట్టివారిపాలెం పంచాయతీ పరిధిలోని కొల్లాబత్తుల మెరక శ్మశానంలో ఖననం చేశారు. మృతుడు కుమారుడు రాజేష్ గత నెల 20న తండ్రికి స్మృతివనం నిర్మించాలని రుస్తుంబాద గాదివారితోటలో స్థలం కొనుగోలు తండ్రి మృతదేహాన్ని తీసుకొచ్చి సమాధి కట్టాడు. నివాసాల మధ్య సమాధి ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారించిన అధికారులు సమాధిని తొలగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో తహశీల్దార్ ఐవివి సత్యనారాయణ, నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్, ఎస్‌లు టి.వెంకట సురేష్, వై.నాగలక్ష్మి, అధికారులు జెసిబి సాయంతో సమాధిని తొలగించి గతంలో పూడ్చిన శ్మశనవాటిలోనే పూడ్చేశారు.

పోలీసులతో వాగ్వివాదం చేస్తున్న వరప్రసాద్ కుటుంబీకులు

ధాన్యం సొమ్ము చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి - పెనుమంట్ర

ధాన్యం డబ్బులు వెంటనే ఇవ్వాలని కోరుతూ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో మార్టేరు పంచాయతీ సెంటర్‌లో సాయంత్రం భారీ వర్షం కురుస్తున్నా రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ ధాన్యం అమ్మి రెండు నెలలైనా డబ్బులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. జిల్లాలో దాదాపు మూడు వేల మంది కౌలురైతులు ఉండగా, వారికి 250 కోట్ల రూపాయలు వరకూ సొమ్ము చెల్లించాలని తెలిపారు. వెంటనే రైతులందరికీ ధాన్యం డబ్బులు, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్, జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, కౌలు రైతు ప్రతినిధులు కవురు శ్రీనివాస్, ఇంజేటి శేఖర్, కేతా పూర్ణారావు, కర్రి నాగిరెడ్డి, మన్నె నగేష్, ఉందుర్తి శ్రీను, గుత్తుల వెంకటేశ్వరరావు, కేతా పాటియ్య పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న రైతులు, నేతలు

దేశంలో కొనసాగుతున్న అప్రకటిత ఎమర్జెన్సీ

సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

ప్రజాశక్తి - వీరవాసరం

1975 జూన్ 25న నాటి ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటిస్తే నేడు మోడీ ఎటువంటి ప్రకటన లేకుండా ప్రమాదకరమైన ఎమర్జెన్సీ అమలు చేస్తున్నాడని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. సిపిఎం మండల స్థాయి విస్తృత సమావేశం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో యండమూరి సుబ్బారావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశంలో గోపాలన్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ కార్మిక కర్షక హక్కులను హరించి కార్పొరేట్లకు మేలు చేసే నిర్ణయాలు చేస్తున్నాడన్నారు. ఇప్పటికే కార్మిక చట్టాలను మార్పు చేసి కార్మిక హక్కులను హరించి పని గంటలు పెంచి భారాన్ని మోపుతున్నారన్నారు. ఈ విధానాలకు నిరసనగా జూన్ 9వ తేదీ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, మండల కన్వీనర్ బొర్రా అల మహారాజు మాట్లాడుతూ వీరవాసరం మండల కేంద్రంలో, అనేక గ్రామాల్లో తాగునీటి చెరువులు కలుషితం కావడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఇప్పటికైనా తాగునీటి చెరువులను శుభ్రపర్చి ఫిల్టర్ చేసిన నీటిని ప్రజలకు అందించకపోతే రానున్న రోజుల్లో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జిఒ 30 ప్రకారం ప్రభుత్వ స్థలంలో నివసిస్తున్న వారికి రిజిస్ట్రేషన్ చేయించే ప్రక్రియ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో బాలం విజయకుమార్, తాళ్లూరి రాము, కేతా జ్యోతిబస్సు, గొట్టుముక్కల శ్యాంబాబు, లింగం సత్యనారాయణ, యాళ్లబండి నారాయణమూర్తి, జుత్తిగ శ్రీనివాస్, సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోపాలన్

వ్యవసాయానికి నీటిపారుదల వ్యవస్థే మూలం

డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు

ప్రజాశక్తి - ఉండి

సాగు చేపట్టడానికి నీటిపారుదల వ్యవస్థ మూలధారమని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. బుధవారం మండలంలోని ఉప్పులూరు, కోలమూరు, పాములపర్రు గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన పంట, మురుగు కాలువల ప్రక్షాళనను స్థానిక నాయకులతో కలిసి రఘు రామకృష్ణరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ఆక్వా రైతుల నిర్లక్ష్యం కారణంగా వరి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పలుమార్లు వారిని హెచ్చరించినప్పటికీ వారితీరు మారడం లేదని తెలిపారు. ఏటా వర్షాకాలంలో ఉప్పులూరు నుంచి పాములపర్రు వరకూ సుమారు 500 ఎకరాలు ముంపునకు గురై రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం నీటి సంఘాలను ఏర్పాటు చేయకుండా ఇరిగేషన్ శాఖను నిర్లక్ష్యం చేసి రూపాయి కేటాయించకపోవడంతో పంట, మురుగు కాలువలు చెత్తాచెదారంతో పేరుకుపోయి వర్షానికి పొలాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. ఆక్వా రైతులు కాలువ గట్లను, మురుగు కాలువ గట్లను ఆక్రమించి గొడౌన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. ఆక్వా వ్యర్థ జలాలను పంట కాలవలోకి వదలకుండా జాగ్రత్త వహించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట గోదావరి డెల్టా ప్రాజెక్ట్ ఛైర్మన్ కునాదరాజు మురళీ కృష్ణంరాజు, కోలమూరు నీటి సంఘం అధ్యక్షులు యర్రా సుబ్రహ్మణ్యం, ఉప్పులూరు గ్రామ సర్పంచి యర్రా దుర్గారావు, ఉప్పులూరు గ్రామ అధ్యక్షులు సుబ్బారావు ఉన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం : ఎంపిపి

ప్రజాశక్తి - వీరవాసరం

వంజా వేమవరంలో ప్రభుత్వ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటానని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వ కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉండటంతో బుధవారం కూటమి నాయకులతో పరిశీలించారు. ఈ కాలనీలో వంజాల్ వేమవరం, తోకలపూడి గ్రామాలకు చెందిన నలబై ఎనిమిది మందికి ఇంటి స్థలాలు కేటాయించారు. అయితే ఈ ప్రాంతం గ్రామానికి లోతట్టుగా ఉండటంతో లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడి ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. సక్రమమైన రహదారి లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం లబ్ధిదారులు కూటమి నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు వాస్తవ పరిస్థితులను పరిశీలించారు. కాలనీలో కొన్ని అంతర్గత రహదారులను అభివృద్ధి చేయడానికి పంచాయతీ నుంచి రూ.లక్షన్నర, మండల పరిషత్ నిధుల నుంచి రూ.5 లక్షల నిధులను కేటాయించనున్నారు. ప్రస్తుతానికి కంకర రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శ్రీనివాసరావు, మల్ల శ్రీరామ్మూర్తి, వంజా రామచంద్రయ్య, శ్రీనివాసరావు, యర్రంకి మాధవరావు పాల్గొన్నారు.

దాతల ఔదార్యం అభినందనీయం

ఎంపిపి వీరవల్లి దుర్గ భవాని చంద్రశేఖర్

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రభుత్వం ముందుకు రాని కాలంలో దాతలు ముందుకొచ్చి పాఠశాల నిర్మాణం చేయడం నేటి సమాజానికి ఆదర్శంగా ఉన్నారని ఎంపిపి వీరవల్లి దుర్గ భవాని చంద్రశేఖర్ అన్నారు. వీరవాసరం పెద్ద దళితపేట, శెట్టిబలిజపేటలోని ప్రాథమిక పాఠశాలలను సర్వ శిక్ష అభియాన్ ఇంజినీరింగ్ అధికారులు బుధవారం పరిశీలించారు. పెద్ద దళిత పేటలో అసంపూర్తిగా నిలిచిపోయిన తరగతి గది నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు అందుబాటులో లేని దానికి రూ.11 లక్షలతో పూర్తి చేయనున్నట్లు ఎఇ ఎం.రమేష్, డిఇ జైపాల్ రాజు తెలిపారు. ఇదేవిధంగా శెట్టిబలిజపేటలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.17.5 లక్షలతో అంచనాలు రూపొందించనున్నారు. దీనికి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎ.శ్రీమన్నారాయణ, కూటమి నాయకులు జవ్వాది బాలాజీ, వీరవల్లి శ్రీనివాసరావు, ఆదిరెడ్డి గంగారావు, వార్డు సభ్యుడు గుర్రాల కృష్ణారావు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని బిజెవిఎస్ ఎయిడెడ్ మహిళా కళాశాలపై వచ్చిన అవినీతి ఆరోపణల ఫిర్యాదులపై బుధవారం కాలేజీ ఎయిడ్ ఎడ్యుకేషన్ ఆర్‌జెడి పివి.కృష్ణాజీ విచారణ చేశారు. కళాశాలకు దాతలు ఇచ్చిన స్థలాన్ని, పాలకవర్గం నిబంధనలకు విరుద్ధంగా విక్రయించారని, సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదని పట్టణానికి చెందిన కొట్టు రామకుమార్, కావలి నాని, మరికొంత మంది ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. విచారణకు ఆదేశించడంతో ఆర్‌జెడి ముందుగా కాలేజీ కరస్పాండెంట్‌కు, నాలి శ్రీనివాస్‌కు నోటీసులు జారీ చేశారు. అయితే ఆయన విచారణకు అందుబాటులో లేరు. అయినప్పటికీ ప్రిన్సిపల్ ఎస్.సిరజ, ప్రభుత్వ ఎయిడెడ్ సిబ్బంది, విద్యార్థుల నుంచి వివరాలను సేకరించి నమోదు చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విచారణ చేస్తున్నామని కరస్పాండెంట్ అందుబాటులో లేకపోవడంతో, ప్రిన్సిపల్ వద్ద సరైన సమాచారం లేకపోవడం వల్ల పూర్తి వివరాలను సేకరించలేకపోయామని చెప్పారు. అవసరమైతే మరోసారి విచారణ చేస్తామన్నారు. స్థలం అమ్మకం, జీతాలు చెల్లించడం దానిపై విచారణ జరిపించాలన్నారు. ఆర్‌జెడి విచారణ విషయం తెలుసుకున్న మదర్ థెరిస్సా వికలాంగుల సంఘం నరసాపురం నియోజకవర్గ వికలాంగులు, బహుజన ఐక్యవేదిక సంఘం ఆధ్వర్యంలో కళాశాల వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి గురుప్రసాద్, చిక్కాల వాసు, గుత్తుల వాసు, బొమ్మిడి అప్పారావు పాల్గొన్నారు.

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి గ్రామసభలు

ప్రజాశక్తి - గణపవరం

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న గ్రామసభలను ఉపయోగించుకోవాలని మండల మత్స్యశాఖ సహాయకులు బొంతు ప్రణీల్ అన్నారు. బుధవారం కొత్తపల్లి, వరదరాజపురం గ్రామాల్లో జరిగిన సభలలో పాల్గొని మాట్లాడారు. ఈ సభలకి సర్పంచులు మద్దాల రత్నకుమారి, గుర్రం సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఆక్వారైతులు ఆక్వాసాగులో ఎదుర్కొంటున్న సమస్యల సభలో వివరిస్తే పరిష్కారానికి అధికారులు కృషిచేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఆక్వారైతులు, విఆర్ఒ సూర్యచంద్రం పాల్గొన్నారు.

కృష్ణమోహనరావు, రమణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపాలిటీలో ఇద్దరు అధికారులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎ.నానాజీ పాలకొల్లు బదిలీకాగా ఆయన స్థానంలో భీమవరంలో ఆర్ఐగా పనిచేస్తున్న ఎస్.కృష్ణమోహనరావు బాధ్యతలు చేపట్టారు. టిపిఒగా పనిచేస్తున్న త్రినాధరావు పాలకొల్లు మున్సిపాలిటీకి బదిలీకాగా ఆయన స్థానంలో కాకినాడ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఎంవి.రమణ బదిలీపై ఇక్కడ బాధ్యతలు తీసుకున్నారు. వారిని ఆయా సెక్షన్ల సిబ్బంది కలసి శుభాకాంక్షలు చెప్పారు.

టిడిపి నూతన పట్టణ కమిటీ ఎన్నిక

తణుకు : టిడిపిని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం తణుకులోని ఎంఎల్ఎ కార్యాలయంలో తణుకు పట్టణంతో పాటు, టిడిపి మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకొని వారిని అభినందించారు. తణుకు నియోజకవర్గ పరిశీలకులు చంద్రు వరప్రకాష్ ఆధ్వర్యంలో తణుకు పట్టణ అధ్యక్షులుగా మంత్రిరావు వెంకటరత్నం, కార్యదర్శి జక్కంశెట్టి వెంకటేష్‌లను ఎన్నుకొన్నారు. తణుకు మండల అధ్యక్షులుగా ఆత్మకూరి రామకృష్ణ, కార్యదర్శిగా దిడ్ల రవికుమార్‌లను ఎన్నుకొన్నారు. వీరిని ఎంఎల్ఎ రాధాకృష్ణ, నాయకులు అభినందించారు.

ఆశా పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఆకివీడు

జిల్లాలో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ల స్థానాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని తహాశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా మొత్తం 1395 స్థానాలకు గాను గ్రామీణ ప్రాంతాల్లో 1200, పట్టణ ప్రాంతాల్లో 195 స్థానాలు ఉన్నాయన్నారు. వాటిలో గ్రామీణ ప్రాంతాల్లో 28, పట్టణ ప్రాంతాల్లో 37, మొత్తం 65 స్థానాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పదవ తరగతి పాసై 25 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉన్న మహిళా అభ్యర్థులు మాత్రమే ఈ ఉద్యోగాలకు అర్హులని ఆయన తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

కల్తీ మద్యం తాగి ఆరోగ్యం పాడుచేసుకోవద్దు : సిఐ

నేరాలు - ఘోరాలు

ప్రజాశక్తి - నరసాపురం

తక్కువ రేటుకు వస్తుందని నాసిరకం, కల్తీ మద్యాన్ని తాగి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని నరసాపురం ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు అన్నారు. నరసాపురం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని యలమంచిలి మండలం శిరగాలపల్లిలో బుధవారం నిర్వహించిన దాడుల్లో 62 కల్తీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ముగ్గుర్ని అరెస్టు చేసినట్లు సిఐ చెప్పారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన గుత్తుల సత్యనారాయణ కల్తీ మద్యాన్ని విక్రయిస్తున్నారన్న సమాచారం పోలీసులకు అందిందన్నారు. దీనిపై నిఘా పెట్టామన్నారు. కోనసీమ జిల్లా కేదారి లంకకు చెందిన సాలా ఈశ్వరరావు బాటిళ్లను తీసుకొస్తు పట్టుబడ్డారు. విచారించగా సత్యనారాయణతో కలిసి ఈశ్వరరావు కల్తీ మద్యాన్ని విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు. వీరిద్దరూ చీప్ లిక్కర్ను కొనుగోలు చేసి పాత బాటిళ్లల్లో కొంచెం నీళ్లు, మద్యాన్ని కలిపి మళ్లీ బాటిళ్లకు సీల్ వేస్తున్నారన్నారు. ఇలా తయారు చేసిన మద్యాన్ని బెల్ట్ షాపుల ద్వారా విక్రయిస్తున్నట్లు నిందితులు చెప్పారన్నారు. వీరికి సీసా మూతల్ని విజయవాడకు చెందిన మనోజ్‌కుమార్ అమ్ముతున్నట్లు తేలిందన్నారు. వీరి ముగ్గుర్ని అరెస్టు చేసి 970 సీసా మూతలు, 100 ఖాళీ బాటిళ్లను, 62 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ముద్దాయిలను కోర్టులో హాజరు పరచగా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు. ఇటువంటి నేరాలు ప్రజల దృష్టికి వస్తే 14405 నంబర్‌కు ఫోన్ చేసి అటువంటివారి ఆట కట్టించాలని, ఈ ఫోన్ నెంబర్‌కు సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచబడతాయని సిఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐలు ఖాసీం, జైనులాబుద్దీన్, హెచ్‌సి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

లిక్కర్ పట్టివేత

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక పాత బస్టాండ్ సమీపంలో ఎన్‌డిపిఎల్ లెక్కన లిక్కర్ విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం సాయంత్రం స్థానిక ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అక్రమ లిక్కర్‌ను విక్రయిస్తున్న వ్యక్తి ఇదే ప్రాంతానికి చెందిన తిరుమల శెట్టి సత్యనారాయణగా గుర్తించామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. అతని వద్దనుంచి 750 ఎంఎల్ సైజులో ఉండే 13 ఫుల్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. అక్రమ విక్రయదారుడుపై కేసు నమోదు చేశామని చెప్పారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వానాకాలం.. జర జాగ్రత్త

వ్యాధుల సంక్రమణకు అవకాశం
పరిసరాల పరిశుభ్రత, కాచి చల్లార్చిన నీటిని తాగాలి
కలవపూడి పిహెచ్‌సి వైద్యాధికారి తాడికొండ భావన

చిట్ - చాట్

ప్రజాశక్తి - కాళ్ల

వర్షా కాలంలో పరిసరాల అపరిశుభ్రత కాస్త ఎక్కువగానే కనిపిస్తుంది. దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని కలవపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ తాడికొండ భావన సూచించారు. ఈ నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాక శుభ్రమైన నీటిని, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తీసుకోవడం వంటి ముందు జాగ్రత్త చర్యలతో వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని ఆమె ప్రజాశక్తికి పలు విషయాలను వివరించారు.

ప్రశ్న : రోజు పిహెచ్‌సిలో ఎంత ఒపి ఉంటుంది? ఏఏ ప్రాంతాల నుంచి రోగులు వస్తారు?

వైద్యాధికారి : రోజు పిహెచ్‌సిలో 100 నుంచి 120 వరకు ఒపి ఉంటుంది. కలవపూడి, ఏలూరుపాడు, జువ్వలపాలెం, ప్రాతళ్లమెరక, మాలవానితిప్ప, ఎల్ఎన్ పురం, కోపల్లె, వేంపాడు ప్రాంతాల నుంచి రోగులు వస్తుంటారు.

ప్రశ్న : మండలంలోని పిహెచ్‌సిలో డెంగీ, మలేరియా కేసులు నమోదయ్యాయా? అయితే కేసులు ఎన్ని?

వైద్యాధికారి : పిహెచ్‌సిలో ఇప్పటి వరకు డెంగీ, మలేరియా కేసులు నమోదు కాలేదు.

ప్రశ్న : పిహెచ్‌సిలో మందుల కొరత ఉందా?

వైద్యాధికారి : పిహెచ్‌సిలో మందుల కొరత లేదు. సబ్ సెంటర్ల పరిధిలో సరిపడా మందులు కూడా ఉన్నాయి.

ప్రశ్న : కలవపూడి పిహెచ్‌సి పరిధిలో ఎన్ని సబ్ సెంటర్లు ఉన్నాయి? అవి ఏవి?

వైద్యాధికారి : ఏలూరుపాడు - 1, 2, కలవపూడి, జువ్వలపాలెం, ప్రాతళ్లమెరక, ఎల్ఎన్ పురం, మాలవానితిప్ప, కోపల్లె, వేంపాడు గ్రామాల్లో తొమ్మిది సబ్ సెంటర్లు ఉన్నాయి.

ప్రశ్న : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

వైద్యాధికారి : వర్షాకాలంలో వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈగల వల్ల వర్షాకాలంలో నీరు కలుషితమై డయేరియా, దోమలు ఎక్కువ అవ్వటం వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గునియా, ఫైలేరియాసిస్ వంటి వ్యాధులు ఎక్కువగా వస్తాయి. నీటిని కాచి చల్లార్చి తాగాలి. వర్షపు నీరు నిలబడుకుండా చూసుకోవాలి. ఒకవేళ నీరు నిలబడితే వెంటనే వాటిని పారబోయాలి. ఒకవేళ నీరు నిల్వ చేసుకోదలచుకుంటే వాటిపై మూతలు ఉంచాలి, ఆహారం వేడిగా ఉన్నప్పుడు తినాలి. ఈగలు వాలకుండా అన్నిటిపై మూతలు ఉంచాలి. దోమలు కుట్టకుండా దోమతెరలు, దోమల మందు వాడాలి. జ్వరాలు వచ్చినప్పుడు అశ్రద్ధ చేయకుండా వెంటనే ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకుని సరైన మందులు వాడాలని సూచించారు.

గూడెం డివిజనల్ పంచాయతీ అధికారిగా ప్రభాకర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం పంచాయతీ డివిజనల్ ఇన్‌ఛార్జి అధికారిగా డిఎల్‌డిఒఎం ప్రభాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన తాడేపల్లిగూడెం డివిజన్ డెవలప్మెంట్ అధికారిగా పనిచేస్తుండగా ఆయనకు అదనంగా డివిజనల్ పంచాయతీ అధికారిగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్, డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు ఆర్‌వి.బ్రహ్మం, టి.రవిచంద్ర, బి.ఫణి కుమార్ అభినందనలు తెలిపారు.

అభివృద్ధికి నాంది.. 'కొట్టు'

కూటమి నాయకులపై వైసిపి నాయకుల ఫైర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం అభివృద్ధికి నాంది పలికింది కొట్టు సత్యనారాయణ అని వైసిపి పట్టణ అధ్యక్షులు కొలుకూరి ధర్మరాజు పేర్కొన్నారు. స్థానిక వైసిపి క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థాయి మరిచి మాట్లాడొద్దని కూటమి నాయకులపై తాడేపల్లిగూడెం వైసిపి నాయకులు ఫైర్ అయ్యారు. వైసిపి పట్టణాధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని శాంతిభద్రతలతో, అభివృద్ధి పథంలో నడిపిన ఘనత మాజీ డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణకే దక్కుతుందన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్ స్వరూపాన్ని మార్చి అభివృద్ధి చేశారన్నారు. వైసిపి జిల్లా కార్యదర్శి బొద్దాని శ్రీనివాస్ మాట్లాడుతూ విశ్వసనీయత కోల్పోయే మాటలు మాట్లాడి మీ స్థాయిని మీ వాళ్లే తగ్గిస్తున్నట్లు ఉందని స్థానిక ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌కు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కరరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యాయమూర్తి గంగరాజు

జాతీయ లోక్ అదాలత్‌పై దృష్టి సారించాలి

సివిల్ జడ్జి జి.గంగరాజు

ప్రజాశక్తి - నరసాపురం

జూలై 5వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, కక్షిదారులకు సమన్యాయం అందించుటలో పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని నరసాపురం సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) జి.గంగరాజు అన్నారు. బుధవారం స్థానిక కోర్టు హాల్‌లో పోలీసు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ రాజీ చేయడానికి వీలుపడే కేసులను ముందుగా గుర్తించి ఇరుపార్టీలకు నోటీసులు ఇచ్చి కౌన్సెలింగ్ ఇవ్వడం వల్ల కొన్ని కేసులను రాజీ చేయవచ్చున్నారు. లోక్ అదాలత్ ప్రాముఖ్యతను, ముఖ్యోద్దేశ్యం కక్షిదారులకు వివరించాలని, ఇప్పటికే గ్రామాలలో పారా లీగల్ వాలంటీర్స్ ద్వారా లోక్ అదాలత్ ప్రాముఖ్యతను తెలియజేయడం జరుగుతుందన్నారు. గతంలో కంటే ఎక్కువ కేసులు రాబోయే జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ చేయవలసిందిగా పోలీస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి, గ్రామీణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.దుర్గాప్రసాద్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఖాసీం, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిద్ధార్థ, కోర్టు లైజన్ అధికారి సూర్య భాస్కర్ రావు పాల్గొన్నారు.

పాలమూరు విద్యార్థినికి ట్రిపుల్ ఐటీలో సీటు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పొలమూరు గ్రామానికి చెందిన విద్యార్థిని ఒంగోలులోని ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించింది. పొలమూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి ఫలితాల్లో 568 మార్కులతో మండల స్థాయిలో ద్వితీయ స్థానం పొందిన పిల్లి రత్నశ్రీ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు స్థానిక సమతా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు తాడిపర్తి సంపత్ రావు బుధవారం ఇక్కడ తెలిపారు. ఇటీవల జరిగిన ట్రస్ట్ కార్యక్రమంలో ఈ విద్యార్థినికి నగదు బహుమతితో సత్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రత్నశ్రీని అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, పిల్లల ఉన్నతి కోసం శ్రమిస్తున్న రత్నశ్రీ తల్లిదండ్రులను ఆయన అభిందించారు.

కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా చాగంటి

నరసాపురం : కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి ప.గో జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ నియమితులయ్యారు. గుంటూరులో హరిబాబు అధ్యక్షతన రాష్ట్రంలోని 13 జిల్లాల డిసిఎంఎస్ ఛైర్మన్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి అసోసియేషన్ కార్యవర్గంను ఎన్నుకున్నట్లు మురళీకృష్ణ తెలిపారు.

పిజిఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి : జెసి

భీమవరం : పిజిఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మండల సర్వే అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో పిజిఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్, జాయింట్ ఎల్‌పిఎం ఎస్ సంబంధించిన పురోగతిపై బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ జిల్లా సర్వే అధికారి, డివిజన్, మండల సర్వేలతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి అర్జీదారుడుతో మాట్లాడి అర్జీలపై మళ్లీ పున్నసమీక్ష చేయాలన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి ప్రభుత్వ పథకాలు జాయింట్ ఎల్‌పిఎంఎస్ వల్ల ఆగి ఉంటే సంబంధిత పట్టాదారులు గ్రామ సచివాలయం లేక మీసేవ కేంద్రాలలో ఆన్‌లైన్ సబ్ డివిజన్ అప్లై చేసేందుకు ప్రతి రీసర్వే పూర్తి అయిన గ్రామంలో డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సర్వేకు సంబంధించి నామమాత్రపు ఫీజు రూ.50 చలానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సర్వే ఇన్‌ఛార్జి అధికారి కె.శ్రీనివాసరావు, డివిజన్ సర్వే అధికారులు జి.మల్లికార్జునరావు, కె.నాగభూషణం, కె.కరుణ కుమార్, సర్వే అధికారులు పాల్గొన్నారు.

సీసలి హెచ్‌ఎం సుబ్బరాజుకు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

వెంకట సుబ్బరాజును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న గ్రామంలో తల్లిదండ్రులు, గ్రామస్తుల అభిమానం పొందడం ఉపాధ్యాయులకు గొప్ప గౌరవమని కాళ్ల ఎంఇఒ ఎ.రవీంద్ర అన్నారు. సీసలి స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించి పిఎస్ హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతి పొందిన అడ్డాల వెంకట సుబ్బరాజుకు బుధవారం అభినందన సత్కారం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికై విశేష కృషి చేసి మనబడి, నాడు-నేడులో బడిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన సుబ్బరాజు సేవలను గ్రామస్తులు కొనియాడారు. పిఎస్ హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతి పొందిన సుబ్బరాజు దొడ్డనపూడి మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా సుబ్బరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎ.రవీంద్ర, గ్రామ సర్పంచి బి.ధనలక్ష్మి శ్రీనివాసరావు, మాజీ సర్పంచి కర్రెడ్డి శ్రీనివాసరావు, జనసేన గ్రామ అధ్యక్షులు నూకల భోగేంద్రబాబు, ఎస్‌ఎంసి ఛైర్మన్ టి.అశోక్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.రవికుమార్, ఉపాధ్యాయులు బిఆర్‌ఎంకె.స్వామి, ఎం.విజయలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. స్థానిక మెంటేవారి తోటలోని సుందరయ్య భవనంలో బుధవారం నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతుల్లో వాసుదేవరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మొండి చెయ్యి చూపారన్నారు. టిడ్కో ఇల్లు కోసం లబ్ధిదారులు లక్షల రూపాయలు అధిక వడ్డీలకు అప్పులు చేసి ప్రభుత్వానికి కట్టినా ఇంతవరకు ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. ఒకవైపు అప్పుచేసిన డబ్బులకు వడ్డీలు కట్టలేక, మరోవైపు ఇంటి అద్దెలు చెల్లించలేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 29వ వార్డు ప్రకాష్ నగర్, ఏడవ వార్డు గాంధీనగర్ ప్రాంతాల్లో ఇప్పటికీ వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంటింటికి కులాయి కలెక్షన్లకు ఆధార్ కార్డులు లేక మైదాన గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలు ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ క్లాసులకు ప్రిన్సిపల్‌గా ఎం.వైకుంఠ రావు, జి.రామకృష్ణ వ్యవహరించగా, మతోన్మాదం-దాని ప్రమాదం పాఠాన్ని సిపిఎం నాయకులు ఎం.ఆంజనేయులు బోధించారు. ఈ క్లాసులకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరపూరితం

అంగన్వాడీ సూపర్‌వైజర్ మేరి

ప్రజాశక్తి - ఉండి

మానవ అక్రమ రవాణా నేరపూరిత చర్య అని అంగన్వాడీ సూపర్‌వైజర్ పి.మేరి అన్నారు. బుధవారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో టీచర్లకి నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మేరి మాట్లాడుతూ మనుషుల అక్రమ రవాణాను నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద నేరంగా ఉందని, ప్రతిరోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీనికి గురవుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మానవ అక్రమ రవాణా ముఖ్యంగా ఉద్యోగం పేరిట, సినిమా అవకాశాల పేరిట మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారని అన్నారు. ఈ అక్రమ రవాణాకు, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ గత 28 సంవత్సరాలుగా పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ, పోలీస్, విద్యా, న్యాయశాఖల సమన్వయంతో ఇప్పటి వరకు 29,200 మంది పిల్లలను, మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించిందన్నారు. సమాజంలో జరుగుతున్న అక్రమ రవాణా అరికట్టడంలో అందరూ భాగస్వామ్యం కావాలని తెలిపారు. పిల్లలు ఏదైనా ప్రమాదం ఉందని గమనిస్తే వెంటనే 1098, 100, 181, 1930 లాంటి టోల్ ఫ్రీ నెంబర్లను ఉపయోగించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్స్ అనిల్‌కుమార్, మిథాలీ రాజ్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పద్మశ్రీ డాక్టర్ ఎంఆర్ రాజు సేవలు ఎనలేనివి

ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రముఖ శాస్త్రవేత్త, గాంధేయవాది, పద్మశ్రీ ఎంఆర్.రాజు సేవలు ఎనలేనివని భీమవరం ఎంఎల్ఎ, పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. పెదఅమిరం గ్రామంలో బుధవారం ఎంఆర్.రాజు స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద అంజిబాబు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తగా సేవలందించి, పెదఅమిరంలో ఎంజిఎం ట్రస్ట్ స్థాపించి తద్వారా కేన్సర్ రోగులకు విశేష సేవలందించిన డాక్టర్ ఎంఆర్ రాజు మరణం తీరని లోటు అన్నారు. ఇటీవల కాలంలో భీమవరం ప్రాంతంలో పద్మశ్రీ పురస్కారం అందుకున్న గొప్ప వ్యక్తి ఎంఆర్ రాజు అని కొనియాడారు. అనంతరం ఎంఆర్ రాజు కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ పరామర్శించి తన సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ

వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ సరుకులు

భీమవరం : జిల్లాలో 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటివద్దే రేషన్ నిత్యావసర సరుకులు అందజేయనున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 65 ఏళ్లు పైబడిన వృద్ధులు సుమారు 70,770 మంది ఉన్నారని, వీరందరికీ జులై నెలకు సంబంధించి నిత్యావసర సరుకులు ముందుగానే ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు ఇంటి వద్ద పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వృద్ధులతోపాటు వికలాంగులు అస్వస్థతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారికి సైతం ఇంటి వద్ద సరుకులు అందజేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు.

ఉపాధి హామీ చట్టం పనులపై సమీక్ష

కాళ్ల : పంట కాలువల్లో గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు ఉపాధి హామీ చట్టంలో చేపట్టాలని కాళ్ల ఎంపిడిఒ జి.స్వాతి అన్నారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ జి.స్వాతి మాట్లాడుతూ కాళ్ల మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పంట కాలువల్లో ఉన్న గుర్రపుడెక్క, తూడు తొలగించి రైతులకు సహకరించాలన్నారు. గ్రామాల వారీగా పంట కాలువల వివరాలను తెలియజేస్తూ ఆయా కాలువలలో ఉపాధి హామీ చట్టం ద్వారా పనులను చేపట్టాలన్నారు. ఎల్ఎన్ పురం గ్రామ పంచాయితీలోని ప్రధాన కాలువలో పనులు జరుగుతూ ఉండగా మిగిలిన అన్ని కాలువలలోను, డ్రెయిన్ లోను గుర్రపు డెక్క, నాచు, తూడు తొలగించడంతో పాటు పూడిక తొలగించు పనులను కూడా చేపట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. ఈ సమావేశంలోఉండి నీటి సంఘ ఛైర్మన్ తోట ఫణిబాబు, కాళ్ల నీటిసంఘ అధ్యక్షులు మొగళ్ల మాధవరావు, ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్ ఎపిఒ కొల్లి శ్రీనివాసరావు, మండల కంప్యూటర్ ఆపరేటర్ కె.శ్రీనివాస్, పలు గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు : డిఎల్‌పిఒ

మొగల్తూరు : గ్రామంలోని పారిశుధ్యం మెరుగుదలకు వెంటనే చర్యలు చేపట్టాలని డిఎల్‌పిఒ జ్యోతిర్మయి సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని రామన్నపాలెం గ్రామాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ గ్రేడ్-5 కార్యదర్శి పి.రవికుమార్, సర్పంచి బందెల ఎలీషాలతో మాట్లాడారు. ఇంటింటా చెత్త సేకరణకు అద్దె వాహనాలను సమకూర్చాలని సూచించారు. ప్రజల నుంచి ఏవిధమైన ఫిర్యాదులు రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మెగా డిఎస్‌సికి 155 మంది గైర్హాజరు

భీమవరం : జిల్లాలో మెగా డిఎస్‌సి పరీక్ష బుధవారం ఐదు పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. ఉదయం సెషన్‌లో 580 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 495 మంది హాజరయ్యారు. 85 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 276 మందికి గాను 206 మంది హాజరు కాగా 70 మంది గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 856 మందికి 701 మంది పరీక్షకు హాజరు కాగా 155 మంది గైర్హాజరయ్యారు. 81.89 శాతం హాజరు నమోదైంది. ఏవిధమైన మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యం కావాలి

డిఇఒ ఇ.నారాయణ

పెనుమంట్ర : అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా అందరు ఉపాధ్యాయులు పనిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని మార్టేరులో నరసాపురం డివిజన్‌లోని ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులతో జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సదస్సులో స్థానిక ఎంఇఒలు వై.లక్ష్మీనారాయణ, యు.నాగేశ్వరరావు, పోడూరు ఎంఇఒలు జివిఎస్.విజయకుమార్, జివి.సూర్యనారాయణ, తణుకు ఎంఇఒ శ్రీనివాసరావు, పలు మండలాల విద్యాశాఖాధికారులు, హెచ్‌ఎం పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహనుండాలి : సిఐ

పాలకొల్లు : మహిళల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, శక్తి మొబైల్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని పాలకొల్లు పట్టణ సిఐ కోలా రజినీకుమార్ సూచించారు. బాలికలపై, మహిళలపై జరుగుతున్న నేరాలను నియంత్రించే చర్యల్లో భాగంగా స్థానిక ఎస్‌సిబి మున్సిపల్ హైస్కూల్లో బుధవారం విద్యార్థినులకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బాలికలపై, మహిళలపై జరుగుతున్న నేరాలకు సంబంధించి పలు చట్టాలు ఉన్నాయని, అయితే పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడంలో విఫలం అవుతున్నారన్నారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, అడిషనల్ ఎస్‌పి భీమారావు ఆదేశాల మేరకు డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద పర్యవేక్షణలో శక్తి టీం జిల్లాలో పనిచేస్తుందని, బాలికలు, మహిళలపై జరుగుతున్న నేరాలకు సంబంధించి సిఐ రజినీకుమార్ దిశా నిర్దేశం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసే క్రమంలో 112 నెంబర్‌కు కాల్ చేసినట్లయితే సకాలంలో పోలీసులు స్పందిస్తారని తెలిపారు. ఈ అవగాహనా కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం రాజ్‌కుమార్, ఎస్ఐ పృథ్వీ, ఎఎస్ఐ మార్లింగం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎను కలిసిన హోటల్స్, స్వీట్ అండ్ బేకరీ నూతన కార్యవర్గం

తాడేపల్లిగూడెం : స్థానిక ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో బుధవారం తాడేపల్లిగూడెం నియోజకవర్గం హోటల్స్, స్వీట్ అండ్ బేకరీ గౌరవ అధ్యక్షులు పైబోయిన రఘు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన తినుబండారులను ప్రజలకు అందించి వారి మన్ననలను చోరుగోనేలా వ్యాపారాలు చేయాలని కోరారు. ఆహార పదార్థాల విషయంలో ఖచ్చితమైన నాణ్యతా ప్రమాణాలను పాటించాలని తెలిపారు. హోటల్ యాజమాన్యం వారు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా భద్రత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి ఎంఎల్ఎ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు వేగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన సర్పంచుల శిక్షణ తరగతులు

తాడేపల్లిగూడెం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సర్పంచులు గ్రామపంచాయతీ పరిపాలనలో చేయాల్సిన విధులు, పంచాయతీలకు వచ్చే నిధులు, తదితర అంశాలను ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్, డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్, గణపవరం డిప్యూటీ ఎంపిడిఒ సత్యనారాయణ వివరించారు. సర్పంచులకు పంచాయతీల్లో మెలకువలను వైకుంఠపాళీ ద్వారా వివరించారు. అనంతరం శిక్షణ పొందిన సర్పంచులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ కోఆర్డినేటర్స్ విశ్వనాథం, కళ్యాణి పాల్గొన్నారు.

కోర్టు ప్రకటన
మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో, ఏలూరు, ఏలూరు జిల్లా.
I.A.No.12/2025
in A.S.No.8/2025
Between:
Masina Veera Venkata Ratnam
...Petitioners/Appellant
And
1.Garapati Veera Raghavulu
2.Garapati Seshagiri Rao
...Respondents/Plaintiffs 1 and 2
1.Respondent/Defendant 1:
Garapati Veera Raghavulu, S/o.(Late) Gopala Rao, Male, aged 76 Yrs, Agriculture, R/o.D.No.11-76, Bhimadole Village and Mandal, Eluru District.
2.Respondent/Defendant 2:
Garapati Seshagiri Rao, S/o.(Late) Gopala Rao, Male, Aged 69 Yrs, Agriculturist, R/o.D.No.11-76, bhimadole Village and Mandal, Eluru District.
పై నెంబర్ దావా I.A.No.12/2025 - IN - A.S.No.8/2025 గ్రంథములో Respondents/ Plaintiffs 1 మరియు 2కు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించిననూ మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారు (సబ్‌స్టిట్యూట్ సర్వీస్) పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు అమలుకు ది.19-06-2025 తేదీన ఆర్డరు వేసినారు. ది.30-06-2025వ తేదీన వాయిదా మీరు పై వాయిదా తేదీన ఉదయం 10.30 ని.లకు పై కోర్టులో స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేనియెడల మీ పై పరోక్షమున తీర్మానించబడును.
K.M.Srinivas Rao (Vasu)
Advocate, Bhimadole.
Cell: 9912181862